# బీజేపీ, కాంగ్రెస్‌లకు గుణపాఠం చెప్పాలి

- ఆ పార్టీలకు ఓట్లు అడిగే అర్హత లేదు
- అభివృద్ధిని చూసే బీఆర్ఎస్‌లో చేరికలు
- ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి సబితా ఇంద్రారెడ్డి

బడంగ్‌పేట, నవంబర్ 5: బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నేతలు గులాబీ గూటికి వస్తుంటే ఆ పార్టీల నాయకుల గుండెలు గుబేల్ మంటున్నాయని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఎద్దేవా చేశారు. బాలాపూర్ మండల పరిధిలోని బాలాజీనగర్‌లో మైనార్టీల సమ్మేళనం, మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 23వ డివిజన్ అధ్యక్షుడు వీర్ రెడ్డి ఆధ్వర్యంలో కాలనీ వాసులతో సమ్మేళనంలో మంత్రి సబితా ఇంద్రారెడ్డి పాల్గొన్నారు. మీర్‌పేటలో బలిజ సంఘం ఆధ్వర్యంలో తిరుమల ఫంక్షన్ హాల్ నిర్వహించిన క్షత్రియ సంఘం ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి పాల్గొన్నారు. కాలనీ వాసులు మంత్రికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మైనార్టీల అభివృద్ధికి ముఖ్య మంత్రి కేసీఆర్ ఎంతో కృషి చేస్తున్నారన్నారు. సీఎం నాయకత్వాన్ని బలపరుస్తూ కారు గుర్తుకు ఓటు వేయాలని ఆమె పిలుపు నిచ్చారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు ఓట్లు వేస్తే నష్ట పోతామన్నారు. సంక్షేమాన్ని గుర్తుంచుకొని బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా తనను ఆశీర్వదించాలని కోరారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులకు ఓట్లు అడిగే అర్హత లేదన్నారు. కాంగ్రెస్‌లో మూడు గంటలు కరెంట్, బీజేపీ ప్రభుత్వం ధర భారం మోపుతుందన్నారు. అలాంటి వారికి ఓట్లు వేస్తే మురికి కుంటలో వేసినట్లేనన్నారు. మతం పేరుతో కులం పేరుతో ప్రజల మధ్యన చిచ్చు పెడుతున్న బీజేపీకి గుణ పాఠం చెప్పాలన్నారు. ఈ నెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 28వ డివిజన్‌లో కార్పొరేటర్ సూర్ణ గంటి అర్జున్ ఆధ్వర్యంలో నైన్ హిల్స్ కాలనీ, సప్తగిరి, శ్రీనిలయ, లిబ్రా, మారుతి నగర్, వసతం విహార్ తదితర కాలనీలో ఇంటింటికీ ప్రచారం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కార్తీక్ రెడ్డి, మీర్‌పేట డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, కార్పొరేటర్లు సిద్దాల బీరప్ప, అనిల్ కుమార్ యాదవ్, ధనలక్ష్మి రాజ్ కుకుమార్, నవీన్ గౌడ్ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కాలనీ సంక్షేమ సంఘాలు పాల్గొన్నారు.



బాలాజీ నగర్‌లో మంత్రి సబితాఇంద్రారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ, కాంగ్రెస్ నాయకులు

## రాత్రి సింఫని కవితా సంపుటి ఆవిష్కరణ



రచయిత బాణాల శ్రీనివాసరావు రచించిన కవితా సంపుటి 'రాత్రి సింఫని' ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాహిత్యంలో చక్కటి కవిత్వాన్ని రాసిన కవి శ్రీనివాస రావు అని అన్నారు. కార్యక్రమంలో ప్రముఖ విమర్శకులు లక్ష్మీనర్సయ్య, సిద్ధార్థ , కవులు గుడిపాటి, ఏనుగు నర్సింహారెడ్డి, సింగిశెట్టి శ్రీనివాస్, రఘు తదితరులు పాల్గొన్నారు. *– చిక్కడపల్లి, నవంబర్ 5*

## చౌదరిగూడ సర్పంచ్ దంపతులకు జాతీయ సేవారత్న అవార్డు



ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేర్చటంతో పాటు ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు అండగా నిలిచిన ఆదర్శప్రాయులు చౌదరిగూడ సర్పంచ్ బైరు రమాదేవి, రాములు గౌడ్ అని ప్రభుత్వ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్ తెలిపారు. మండల పరిధిలోని చౌదరిగూడలో పీవీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సర్పంచ్ బైరు రమాదేవి, మాజీ సర్పంచ్ రాములు గౌడ్‌లను జాతీయ సేవారత్న అవార్డు-2023ను అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మహేందర్ గౌడ్, పంచాయతీ సభ్యులు, ఆయా కాలనీల అసోసియేషన్‌ల కమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. *– ఘట్‌కేసర్ రూరల్, నవంబర్ 5*

## ఆకట్టుకున్న డాగథాన్



తెలంగాణ క్యానైన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెక్లెస్‌రోడ్‌లోని ఈట్‌స్ట్రీట్ వద్ద ఆదివారం నిర్వహించిన పెట్ స్టార్ డాగథాన్ ఆకట్టుకున్నది. వివిధ జాతుల శునకాలతో ర్యాలీ నిర్వహించి, ఉత్తమమైన ప్రదర్శన ఇచ్చిన వాటి యజమానులకు సర్టిఫికెట్లు అందజేశారు. *– ఖైరతాబాద్, నవంబర్ 5*

## 8న మంత్రి మల్లారెడ్డి నామినేషన్ దాఖలు

మేడ్చల్, నవంబర్ 5 (నమస్తే తెలంగాణ) : మేడ్చల్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి ఈ నెల 8న నామినేషన్ దాఖలు చేయనున్నారు. కీసర రామలింగేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజల అనంతరం భారీ ర్యాలీగా వెళ్లి కీసరలో నామినేషన్ వేయనున్నట్లు మంత్రి మల్లారెడ్డి తెలిపారు. నామినేషన్ వేసేందుకు వెళ్లే ర్యాలీకి నియోజకవర్గంలోని బీఆర్ఎస్ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

## చిన్నారులకు టీకాలు వేయించాలి

సిటీబ్యూరో, నవంబర్ 5 (నమస్తే తెలంగాణ): చలికాలం ప్రారంభమవుతుండడంతో చిన్నపిల్లలకు ఫ్లూ టీకా వేయించాలని వైద్యనిపుణులు సూచిస్తున్నారు. చలికాలంలో వచ్చే ఫ్లూ, న్యుమోనియా, వైరల్ ఫీవర్స్ వంటి సీజనల్ వ్యాధులకు ఫ్లూ వ్యాక్సిన్‌తో చెక్ పెట్టవచ్చని నిలోఫర్ వైద్యుడు డాక్టర్ రమేశ్‌దాంపురి తెలిపారు. అన్ని ప్రభుత్వ దవాఖానల్లో ఖరీదైన పెంటా వ్యాక్సిన్‌ను ఉచితంగానే ఇస్తున్నారని, అందులో ఫ్లూకు సంబంధించిన టీకా కూడా ఉన్నప్పటికీ ఫ్లూ వ్యాక్సిన్ ప్రత్యేకంగా ఇప్పియడం పిల్లలకు ఆరోగ్యకరమని తెలిపారు.

## మోదీ పర్యటనను అడ్డుకుంటాం

హిమాయత్‌నగర్, నవంబర్ 5 : కుంటి సాకులు చెప్పి బీసీలను మోసం చేసిన నరేంద్రమోదీని అడ్డుకుంటామని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్ గౌడ్ అన్నారు. ఆదివారం హిమాయత్‌నగర్‌లోని బీసీ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీలకు మోదీ ఏం చేశారని ఈ నెల7న హైదరాబాద్‌లో జరిగే బీసీ గర్జన సభకు హాజరవుతున్నారని ప్రశ్నించారు. బీసీ ఓట్లను ఆకర్షించేందుకు పూటకో మాట చెప్పే మోదీ, అమిత్‌షాలను నమ్మవద్దన్నారు. తాము అధికారంలోకి వస్తే బీసీ వ్యక్తిని సీఎం చేస్తామని ప్రకటించడం హాస్యాస్పందంగా ఉందన్నారు. సమావేశంలో సామాజిక న్యాయ జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ ప్రభంజన్ యాదవ్, వైస్ చైర్మన్ వంగరాములు గౌడ్, నాయకులు బత్తుల సిద్దేశ్వర్లు, లింగాల కృష్ణగౌడ్, భిక్షపతి గౌడ్, నరసింహా, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నరేందర్ గౌడ్

## తిరునగరి స్మారక పురస్కారాలు ప్రదానం

తెలుగు యూనివర్సిటీ, నవంబర్ 5. ఆధునిక తెలుగు సాహిత్య ప్రక్రియలో డాక్టర్ తిరునగరి తనదైన ముద్ర వేసుకున్నారని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య కిషన్‌రావు అన్నారు. తెలుగు వర్సిటీ సమావేశ మందిరంలో కవన మిత్ర సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ప్రముఖ కవి డాక్టర్ తిరునగరి స్మారక పురస్కారాల ప్రదానోత్సవం ఆదివారం నిర్వహించారు. ఉత్తమ పద్య సంపుటి భూవిలాపం రచించిన నటరాజరావుకు, చింతల తొవ్వ కవితా సంపుటి రచయితుల శ్రీనివాస్‌లకు పురస్కారాలు ప్రదానం చేశారు. కవన మిత్ర సంస్థ అధ్యక్షుడు పెసరు లింగారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సభలో తెలుగు వర్సిటీ వీసీ ఆచార్య కిషన్‌రావు, ఓయు తెలుగు శాఖ పూర్వ అధ్యక్షుడు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, సాహితీవేత్తలు డాక్టర్ గడ్డం మోహన్‌రావు, డాక్టర్ పెసరు వేణుగోపాల్‌రెడ్డి, డాక్టర్ తిరునగరి శ్రీనివాస్, గడ్డం లక్ష్మయ్య, డాక్టర్ సాగర్ల సత్తయ్య, బండిరాజుల శంకర్, డాక్టర్ పోరెడ్డి రంగయ్య, రఘుశ్రీ పాల్గొని తిరునగరి సాహిత్య వ్యక్తిత్వాన్ని, పురస్కారగ్రహీతల కృషిని కొనియాడారు.



డాక్టర్ తిరునగరి స్మారక సాహిత్య పురస్కారాలను ప్రదానం చేసిన ఆచార్య కిషన్‌రావు, కసిరెడ్డి వెంకటరెడ్డి

## నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

చిక్కడపల్లి, నవంబర్ 5 : సొసైటీ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ (ఎస్ఆర్‌డీ) సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ, ప్లేస్‌మెంట్ కల్పించనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్ నందు ఉద్యోగులకు కోసం అకౌంటింగ్ బేసిక్స్, కమ్యూనికేటివ్ ఇంగ్లిష్ తదితర అంశాల్లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. డిగ్రీ పాసైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిక్షణ పూర్తయిన తర్వాత సర్టిఫికెట్ అందజేస్తామని తెలిపారు. వివరాల కోసం 96407 35115 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

# త్వరలో పూర్తి స్థాయిలో బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలు

సుల్తాన్‌బజార్, నవంబర్ 5: దేశంలోనే టెలికాం రంగంలో వినియోగదారుల ఆదరణను చూరగొన్న బీఎస్ఎన్ఎల్ తన సేవలను మరింత విస్తరించడానికి త్వరలోనే పూర్తి స్థాయిలో 4జీ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తుందని బీఎస్ఎన్ఎల్ బోర్డు న్యూఢిల్లీ సీఎఫ్‌ఏ డైరెక్టర్ వివేక్ బంజాల్ తెలిపారు. ఆదివారం బీఎస్ఎన్ఎల్ తెలంగాణ టెలికాం సర్కిల్ ఆధ్వర్యంలో ఆదర్శ్‌నగర్ లోని బీఎస్ఎన్ఎల్ భవన్ నుంచి నెక్లెస్ రోడ్డు వరకు నిర్వహించిన 5కే రన్‌ను ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి బీఎస్ఎన్ఎల్ తెలంగాణ టెలికాం సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ చాగంటి శ్రీనివాస్‌తో కలిసి జెండా ఊపి రన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎస్ఎన్ఎల్ సేవలను మరింత విస్తరించేందుకు గాను దేశ వ్యాప్తంగా 4జీ సేవలను పూర్తి స్థాయిలో వినియోగదారుల సౌకర్యార్థం అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు పేర్కొన్నారు. విజేతలుగా నిలిచిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో బీఎస్ఎన్ఎల్ తెలంగాణ టెలికాం సర్కిల్ సీజీఎం చాగంటి శ్రీనివాస్, సర్కిల్ ఆఫీస్ పీజీఎం ఎన్ మురళీ, హైదరాబాద్ టెలికాం జిల్లా పీజీఎం సుజాత, సర్కిల్ ఆఫీస్ పీజీఎం, సీఎఫ్‌ఏ అనిలా కిరణ్, సర్కిల్ ఆఫీస్ జీఎం మహేంద్ర సింగ్ రౌత్, హైదరాబాద్ టెలికాం జిల్లా పీజీఎం విజయ్‌కుమార్,సర్కిల్ ఆఫీస్ జీఎం ఈబీ గోల్డ్ కళ్యాణ్, జీఎం ప్లానింగ్ దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.




5కే రన్‌ను ప్రారంభిస్తున్న బీఎస్ఎన్ఎల్ బోర్డు న్యూఢిల్లీ సీఎఫ్‌ఏ డైరెక్టర్ వివేక్ బంజాల్, తెలంగాణ టెలికాం సర్కిల్ సీజీఎం చాగంటి శ్రీనివాస్